# ఇరుగు - పొరుగు

మన ఇంటిప్రక్కన ఉన్నవాళ్ళను బట్టి ఉంటుంది మన సౌఖ్యం.

ఇరుగూ పొరుగూ అన్నారు. మనకు కీర్తి వచ్చినా అపకీర్తి వచ్చినా వాళ్ళవల్లె వస్తుంది. మన ఇంటి ప్రక్కన ఒక ప్లీడరు గుమాస్తా ఉన్నాడనుకోండి. ఇక మనకర్మం కాలిందన్నమాటే ఆ ఇంట్లో అత్తకూ కోడలకూ పడదు. అత్త ఆ పిల్లను కాల్చుకుతింటూ ఉంటుంది. ఆపిల్ల అప్పుడప్పుడు మన ఇంటికి వస్తూ ఉంటుంది ఆ అమ్మాయి మనతో ఏవో నేరాలు చెప్పుతున్నదని ఆ ముసలిదానికి అనుమానం.

ఓమారు సరిగ్గా అలాగే జరిగింది గదా. మా ఆవిడ మా ఇంటిప్రక్కావిడ కోడలూ ఒక్క ఈడువాళ్ళు. అంచేత ఆ పిల్ల మా ఇంటికి వచ్చి ఏదో పిచ్చాపాటి కాసేపు మాట్లాడుకొని వెళ్ళిపోతుండేది. ఆ ముసలిదానికి మా ఆవిడపైన కోపంగా ఉండేది. ఏమీ అనలేక వీలైనపుడల్లా ఏవో సూటీ పోటీ మాటలు అనటం సాగించింది.

అందరిళ్ళల్లోనూ ఉంటై తగూలు. పొరుగింటి తగూ అంటే కొందరు చెవి కోసుకుంటారు. అత్తమామల్లో, ఆడ బిడ్డల్లో కాపురం చేయకుండా అదృష్ట వశాత్తు పొరుగూరిలో ఒంటరి కాపురం చేస్తున్నది కాబట్టి ఆ కాంతమ్మ తింగురంగా

అంటూ కులుకుతున్నది. అర్ధశేరు బియ్యం అత్తెసరు వేసి, నెంకు వంకాయలు వేయించిందా అంటే ఇక పనేలేదు ఆ అమ్మాయికి ఇల్లాగ ఉండాలంటే ఎల్లాగ వీలు అవుతుంది నవాన్న అందరికీని - అని ఇల్లాగ ఏవో సాధింపు మాటలు అంటూ ఉండేది. అప్పుడు మా కాంతం కొత్తగా కాపురానికి వచ్చిన రోజులు. ఇంకా మాకు సంతానం కలగలేదు.

పిల్లా జల్లా లేకుండా ఒంటరి కాపురం చేస్తున్న రోజుల్లో పొరుగింటి వాళ్ళు ఎల్లాంటి వాళ్ళు అయినా మనకు అట్టే బాధ ఉండదు. అయితే కాస్త జాగ్రత్తగా ఉండాలిసిందల్లా భార్య పుట్టింటికి వెళ్ళినప్పుడే. ఆ నాలుగు నెలలో ఆరు నెలలో మటుకు వంచిన తల ఎత్తకుండా నడవాలి ఆ వీధిలో. అప్పుడే మన గౌరవం దక్కుతుంది. ఇంటావిడ, బిడ్డకు మూడో నెల వెళ్ళకమునుపే వచ్చినప్పుడు, ఇంటి ప్రక్కవాళ్లు మనలని గురించి మంచిగా చెబుతారు. లేక...

నీవు ఒకరోజున స్నానంచేస్తూ ఉండటం - ఆ సమయాన్నే పొరిగింటి ఆవిడ కోడలు పూల జడ వేసుకొని దొడ్డి గోడ మీదుగా తొంగి చూడటం నీవు ఆ చక్కని పిల్లను నివ్వెర పోయి చూస్తూ అవతల వంటింటి గుమ్మంలోనుంచి ఆ అమ్మాయి అత్తగారు గుడ్లు మిటకరించి చూస్తున్నట్లు గమనించక పోవటం, ఇత్యాది విషయాలు జరిగినయ్యా, నీ కర్మం కాలిందే.

అసలే అనుమాన పడుతుంటుంది మా ఆవిడ. మొగుడి మీద ప్రేమ ఉన్న ప్రతి మానవతికి అటువంటి అనుమానం

ఉండటం సహజం. అంచేతలో తాను లేనప్పుడు ఏమి అన్యాయం జరిగిందో నని భయపడుతూనే వస్తుంది మీా ఆవిడ. వచ్చి రావటంతోనే కొంప మునిగిపోయినట్లు పరుగెత్తుకొని వచ్చి ఆ ముసలిముండ సమీాప నేరాలు చెప్పేస్తుంది ఉన్నవి కొన్ని, లేనివి కొన్నిని. నీవు ఎంతో ఉత్సాహంతో ఇంటికి వస్తావు ఎన్నాళ్ళకో వచ్చిన భార్యను చూచి కబుర్లు చెప్పుకుందామని, బిడ్డను ముద్దాడుదామని ఆతుర్దాతో ఇంటికి వచ్చేసరికి బుస బుసలూ రొస రొసలూనూ మీా ఆవిడ. కారణమూ నీకు తెలియదు ఆవిడ చెప్పనూ చెప్పదూ. ఏమిటే కాంతం, అది నేననేమాట. నీవుకూడా ఏదో పేరుపెట్టి పిలుస్తావుగా. ఏమిటే, రాజ్యం సుబ్బులూ, లక్ష్మీ (ఏదో ఒకటి) ఎందుకే అల్లాగ ఉన్నావు. సంతోషంగా లేవేం ? అమ్మాయికి ఇంకా నీళ్ళు పోశావుకావేం, మధ్యాహ్నం కాఫీ తాగలేదా అంటూ ఏవో వెయ్యి ప్రశ్నలు వేస్తావు. నా సంగతి మీా కెందుకు లెద్దురూ. మీాకు నేనే కావాలిసి వచ్చాను. అనో లేకపోతే ఇంకా మృదువుగానో ఏదో నీరసం మాట అనేస్తుంది. మీా ఆవిడ. అసలు సంగతి చెప్పదు. ఆ సాయింత్రం నీవు బ్రతిమిలాడినా, ఒట్టిదే. భయపెట్టినా ఒట్టిదే. ఆ రాత్రికి ఎప్పుడో బయట పెడుతుంది అసలు సంగతి నీవు ఎంతో బ్రతిమిలాడిన తరువాత. ఆతరువాత, అదంతా అబద్ధం అని నచ్చజెప్పే టప్పటికి తల ప్రాణం తోకకు వస్తుంది. ఇదేమైనా నలుగురిని పిలిచి సిలవ దీసి అడిగి నిజం తేల్చే విషయం కాదాయె. ఎల్లాగ మీా ఆవిడను నమ్మించటం. చాలా కష్టం ప్రాణంమీాదికి వస్తుంది.

కాబట్టి ఇరుగు పొరుగుతో బహుజాగ్రత్తగా ప్రవర్తించాలి. అనుభవంమీద వ్రాస్తున్నాను.

సాధారణంగా నీవు అద్దెకు ఇల్లు తీసుకొనే టప్పుడు మీ ఇంటి ప్రక్కవాళ్లకు ఫోను గాని టీవీయో గాని ఉండేటట్లు చూసుకో. సాధారణంగా వెన్నెల రాత్రిళ్ళు, భోజనానంతరం వాళ్ళు ఫోను పెట్టుకొని కూర్చుంటారు. మనకు అదీ చాలా అనుకూలం. మనకే ఫోను ఉంటే, ఉండే బాధలు ఏమీ లేకుండా, ఫోను ఉండటం మూలాన కలిగే సౌఖ్యం అంతా అనుభవించవచ్చు మననెవ్వరూ ఫోను ఇవ్వమని అడగరు. కార్యక్రమాల విషయంలో అప్ టు డేట్ గా మాట్లాడుతూ, స్వంతానికి ఫోను కలిగి ఉన్న వాళ్ళలాగే మాట్లాడవచ్చును.

మన ఇంటిప్రక్కవాళ్ళకు పిల్లలు ఉండకూడదు. అంటే నీవు అట్లా కోరాలని నేను అనను. నీవు కోరినంత మాత్రాన వాళ్ళకు పిల్లలు కలుగకుండా ఉండటమూ జరుగదు. అయినా అటువంటి కోరికలు కోరమని కాదు నేనటం. పిల్లలు లేని సంసారం ప్రక్కనే నీవు ఉండూ అంటాను.

పిల్లలు ఉంటే...

వాళ్ళ పిల్లలకూ మన పిల్లలకూ పోట్లాటలు తప్పవు. ఒకసారి నేను ఉన్న ఇంటిప్రక్క ఆయనకు నలుగురు పిల్లలు ఉండటం తటస్థించింది. ఇక మా అవస్థ చెప్పటానికి వీలులేదు. మొదట్లో వాళ్ళ పిల్లలూ మా పిల్లలూ కలిసి ఆడుకుంటారని సంతోషించాను. కాని ఏం జరిగింది?

వాళ్ళరాముా ఎర్ర కాగితం ఒకటి పుల్లకు గుచ్చి ఆడుకొంటూ ఉన్నాడు. మా రాధాయిచూశాడు దాన్ని. పోనీ తనకూ అటువంటిది ఒకటి కావాలని చెపితే చేసి ఇవ్వనూ. ఉంహూ, అల్లాగ చెప్పక, వాడిచేతుల్లో కాగితాన్ని గద్దతన్నుకొచ్చినట్లు లటుక్కున లాక్కొచ్చాడు ఇంక వాడిసంగతి. చప్పున వచ్చి నాతోనో తల్లితోనో, మీ అబ్బాయి నా ఎర్రకాగితం లాక్కున్నాడు. నాది నాకు ఇప్పించండి అని అడగవచ్చునా. మాటలు వచ్చిన వెధవ అహా అట్లా అడక్క, తపీమని నేలపై పడిపోయి, కెవ్వున కేకేసి, ఒక్కపెట్టున ఏడ్పు సాగించాడు. బట్టలు బాడి అయినై. వాళ్ళ అమ్మ వచ్చి ఏమిట్రా నాయినా అని ఎంతో సేపు అడిగితే చివరకు చెప్పాడు ఈ అన్యాయాన్ని గురించి. ఆమె వచ్చి మాఆవిడమీద కేక వేసింది. ఏమిటమ్మా, మీ రాధాయ పిల్లల చేతుల్లో చిల్లిగవ్వ అయినా నిలవనీయడు, తపీమని గద్దతన్నుకు పోయినట్లు తన్నుకుపోతాడు ఎట్లాగ ఏడ్చేదమ్మా అని. ఈవిడకూ ఉక్రోషం. నా కొడుకు అంత చెడ్డవాడా అని......మీవాడూ అంతేనమ్మా అన్నది. అక్కడనుంచి వేసుకొన్నారు పోట్లాట ఒక అరగంట సాగింది. ఇంతలో మా రాధాయ ఆ కాయితం కాస్తా చింపేశాడు. ఆ సంగతి రాముా కనిపెట్టి మళ్ళీ కెవ్వు మన్నాడు. ఇంతలోకి నేనొచ్చి రామూను ఊరుకో పెడదామని ఇంకో ఎర్రకాయితం ఇస్తే ఒప్పుకోడే! పోనీ ఎన్నిరంగు కాయితా లిచ్చినా ఒప్పుకోడే! ఆ కాయితమే కావాలంటాడు. చినిగిపోయిందిరా నాయినా ఆ కాయితం ఇంకోటి తీసుకోరా అంటే వినడే! ఎల్లాగ వీళ్ళ

తకబాతీర్పట !!! కాబట్టి ఇంకోసారి చెప్పవచ్చేదేమిటి అంటే ఈ పిల్లల సంగూలకి ప్రాణం మైదానం అవుతుంది. కొంచెం పెంపకానే జాగ్రత్తగానే పల్లా జెల్లా తెలివాళ్ళకు దగ్గరగా ఉంచటం మంచిది. ప్రక్క ఇంటి వాళ్ళకు పిల్లలు లేకపోతే మన పిల్లలనే ఎత్తుకొని ముద్దాడి మిఠాయిలు, డబ్బూ, అవీ, తరుచు వాళ్ళకు పెడుతూ ఉంటారు.

మన ఇంటి ప్రక్కవాళ్ళకు కారు కూడా ఉంటేమంచిది. ఎప్పుడైనా అందులో ఎక్కి మనం కూడా షికారు వెళ్ళటానికి అవకాశం ఉంటుంది.

మన ఇంటిప్రక్క ఆవిడ చక్కనిదైతే ఫ్యాషన్ తెలిసినదైతే చాలా అదృష్టం. ఆమె మన ఆడవాళ్ళకు అప్పుడప్పుడు తల దువ్వి పూలు పెట్టి కట్టూ బొట్టూ నేర్పుతుంది.

మన పిల్లలను రోజూ ముస్తాబుచేసే పని ఆమెకే అప్పజెప్పయ్యాలి. మన పిల్లలు ఆమెను అత్తయ్యా అని పిలుస్తూ, ఎప్పుడూ అక్కడే కాలం గడుపుతూ ఆడుకుంటూ ఉండటం జరుగుతుంది.

దేముడు మేలుచేసి, మన ఇంటి ప్రక్కవాళ్ళు డబ్బున్నవాళ్ళు అయి ఉండాలని మనం కోరుకోవాలె. అల్లాగ అయితే వాళ్ళు మనలను ఎప్పుడూ డబ్బు అప్పు అడగరు. కాస్తో, కూస్తో వాళ్ళ వద్దే మనము అప్పు పుచ్చుకోవచ్చు.

మన ఇంటి ప్రక్కవారి దొడ్లో కాస్త కాయా కూరా పండుతూ ఉండటం, పూలూ అవీ పూస్తూ వుండటం కూడా అవసరం——